# భావాలాపనలు

వెన్నెలకంటి మాణిక్యం

ఎమెస్కో

## సుప్రభాత సేవ రాగ మాలిక

**రాగం : భౌళి** **తాళం : ఆది**

సుప్రభాతం వేంకటేశ శుభోదయం శ్రీనివాస
సుప్రభాతం కలియుగవాస శుభోదయం వైకుంఠవాస

చ॥ మందస్మిత వదనాయ, అరవింద లోచనాయ
చతుర్భుజ శంఖ చక్రాయ, శరణాగత చరణాయ
శుభములు కోరి, భక్తులు భజన చేయుచున్నారు
చూడ లేవయ్య, లేచి కావవయ్య, కరుణాంతరంగ
సుప్రభాతం సుప్రభాతం

**రాగం : నాట** **తాళం : ఆది**

చ॥ సుప్రభాతం భవభయహరాయ శుభోదయం భవబంధ నాశనాయ
భవభయహరాయ భవబంధనాశనాయ కామితార్థప్రదాయ
లోకకళ్యాణము చేయ హరి నీవు లేవవయ్య
అలివేలు మంగతో కూడి, శీఘ్రలేవవయ్య
ఆశ్రితమందార, అవనిజపాల, సుప్రభాతం, సుప్రభాతం.

**రాగం : హంసధ్వని** **తాళం : ఆది**

చ॥ సుప్రభాతం లక్ష్మీహృదయేశ,
శుభోదయం భక్తహృదయనివాస, శుభోదయం భక్తహృదయనివాస
లక్ష్మీహృదయేశ, భక్తహృదయనివాస, సర్వలోకపాలా, శేషాచలవాసా
లేచి ఈ వేళ నిను చూడ నా పుణ్య ఫలమో కరుణాంతరంగ
కమనీయరూప, వేగలేవవయ్య వేచియున్నారు, మునులు తాపసులు
వేగలేవవయ్య
కోటితీర్థవాసా శ్రీనివాసా... సుప్రభాతం.

## తోమాల సేవ

రాగం : దేశి　　　　　　　　　　　　　　తాళం : ఆది

ప॥ తోమాలసేవ చేసెద నామాలరాయునికి
మాధవునికి, మధుసూదనునికి ॥తోమాల॥

చ॥ ముఖప్రక్షాళనము ముకుందునకు చేసెద
అభ్యంగనము, అభయహస్తునకు
కస్తూరిలేపనము కలికి శ్రీనివాసునికి
నుదుటతిరునామము తిరుమలేశునికి ॥తోమాల॥

చ॥ పీతాంబరము వేదాంతవిభునికి
శ్రీపాదరేణు పద్మనాభునికి
తులసిమాలలు తుంబురునుతునికి
ధూపదీపములు దామోదరునికి ॥తోమాల॥

చ॥ గులాబి చేమంతులు, కదంబమాలలు
చక్రధరునికి, శ్రీధరునికి
వకుళమాలలు వకుళానందునికి
వనమాలలు వనజాక్షునికి ॥తోమాల॥

చ॥ కాసుమాలలు కమలాక్షునికి
కోటిమాలలు కోటితీర్థునికి
రత్నభూషణాలు రమణీయునికి
వజ్రవైడూర్యాలు వైకుంఠునికి ॥తోమా॥

## అర్చన

**రాగం : మోహన** **తాళం : ఆది**

కేశవా మాధవా గోవిందా

ప॥ శతనామాలతో సేవించేదా
వెయ్యినామాలతో వేడుకోనేదా
కోటినామాల కొలిచేదా
అనంతనామాల అర్చన చేసేదా ॥శత॥

చ॥ అవతార పురుషుని, మదిలోనిలిపి
అచ్యుతా, అనిరుద్ధా, గోవిందాయని
కేశవా, మాధవాయని, పలునామాలతో
హరినామాలతో అర్చించేదా ॥శత॥

**రాగం : వసంత**

శ్రీనివాసుని చిత్తమున నిలిపి
భవబంధముక్తికి నారాయణాయని
నారాయణాయని నారాయణాయని
హరి నామాలతో అర్చించేదా ॥శత॥

**రాగం : అభేరి**

అఖిలమునా, అందరివాడు
అందరికీ అందెడువాడు
అనంతనామములు కలవాడు
అంతరంగమున హరి ఒక్కడే
హరి హరి హరి యని
హరి నామామృతము గ్రోలగరాదా ॥శత॥